క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన చందు



వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) కలెక్టర్ మల్లికార్జునను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వపరంగా అమలు చేసే అన్ని కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. - గాజువాక

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన



శ్మశానవాటిక నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం లోని శ్మశానవాటిక నిర్మాణ పనులను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.2 కోట్ల నిధులతో శ్మశానవాటిక అభివృద్ధి జరుగుతోందన్నారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, త్వరలోనే శ్మశానవాటికను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో గాజువాక విద్యార్థిని ప్రతిభ



వైష్ణవిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతి

గాజువాక: భీమునిపట్నం డైట్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి విశాఖ కళా ఉత్సవ్–2023 చిత్రలేఖనం పోటీల్లో గాజువాక హైస్కూల్ విద్యార్థిని టి.వైష్ణవి ద్వితీయ స్థానం సాధించింది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైష్ణవి ఫైన్ ఆర్ట్స్‌లో మంచి ప్రతిభ ప్రదర్శిస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయ ప్రశాంతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైష్ణవికి బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో చిత్ర కళా ఉపాధ్యాయుడు భావనారుషి, జనార్ధన్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేష పూజలు



విశేష అలంకరణలో గోదాదేవి

సింహాచలం: సింహగిరిపై సోమవారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడా మండపంలో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు పవన్‌కుమార్ తదితరులు ఈ పూజలను నిర్వహించారు.

ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు ఆరో రోజు సోమవారం విశేషంగా జరిగాయి. భక్తులు స్వామి నామస్మరణలో మునిగితేలారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీలో అధిష్టింపజేసి ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో అధిష్టింపజేసి దివ్యప్రబంధం పారాయణం చేశారు.

'డిజిటల్'తో సరికొత్త ఒరవడి

నడుపూరు పాఠశాల
26 ప్యానల్స్, **3** టీవీలు

ఇస్లాంపేట పాఠశాల
12 ప్యానల్స్, **3** టీవీలు

గంగవరం పాఠశాల
6 ప్యానల్స్, **3** టీవీలు

యారాడ పాఠశాల
6 ప్యానల్స్

- బోధనలో కొత్త పుంతలు
- తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ప్లాట్ ప్లానెల్స్
- విద్యార్థుల్లో పెరిగిన ఆసక్తి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సర్కారు బడుల్లో బోధన కొత్త పుంతలు తొక్కుతోంది. విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన ప్రభుత్వం ఇప్పుడు సాంకేతిక ప్రగతిని విద్యార్థులకు చేరువ చేసేలా డిజిటల్ తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. పాఠాల బోధనకు అవసరమైన పరికరాలను సమకూర్చుతోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసి విద్యార్థులకు దృశ్య, శ్రవణ పద్ధతుల్లో సరికొత్తగా పాఠాలు బోధించడంతో విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతోంది.

ఇది కదా అభివృద్ధి




యారాడ స్కూల్లో పిల్లలకు డిజిటల్ విధానంలో బోధిస్తున్న హెచ్ఎం సుబ్రహ్మణ్యం



ఇస్లాంపేట హైస్కూల్‌లో తిలకిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: నాడు–నేడు పథకంలో సర్కారు పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. డిజిటల్ తరగతి గదులూ అందుబాటులోకి వచ్చాయి. అందులో భాగంగా పెదగంట్యాడ మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో నడుపూరు, ఇస్లాంపేట, యారాడ పాఠశాలల్లో డిజిటల్ బోధన ప్రారంభం కాగా గంగవరం పాఠశాలలో ఈ నెల 21 నుంచి డిజిటల్ తరగతులు ప్రారంభం కానున్నాయి. నడుపూరు పాఠశాలకు 26 ప్యానల్స్, 3 టీవీలు, ఇస్లాంపేట పాఠశాలకు 12 ప్యానల్స్, 3 టీవీలు, యారాడ పాఠశాలకు 6 ప్యానెల్స్, గంగవరం పాఠశాలకు 6 ప్యానెల్స్, మూడు టీవీలను అమర్చారు. ఒక్కో ప్యానెల్‌కు రూ.లక్ష, టీవీకి 50 వేల చొప్పున ఖర్చు చేసి వీటిని సమకూర్చారు.



నడుపూరు హైస్కూల్‌లో డిజిటల్ బోధన సాగిస్తున్న సూర్యకిరణ్

సులభరీతిలో అవగాహన

పాఠాలను దృశ్య, శ్రవణ రీతిలో బోధించడంతో విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందజేసింది. స్మార్ట్ టీవీలకు ఇంటర్‌నెట్ అనుసంధానం చేసి ఐఎఫ్‌పీలకు యూట్యూబ్‌ను కనెక్ట్ చేసి పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. వీటి ద్వారా క్లిష్టమైన అంశాలను సైతం సులభంగా నేర్చుకుంటున్నారు. విద్యార్థులకు అవసరమైన అంశాలను ఫైల్ రూపంలో సేవ్ చేసుకుని అవసరం ఉన్నపుడు మళ్లీ వాటిని చూడడం, వినడం చేస్తున్నారు. ఈ విధానం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీపడి ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



ఇస్లాంపేట హైస్కూల్‌లో ఉర్దూలో డిజిటల్ బోధన సాగిస్తున్న ముజాహిద్దీన్ హక్

ఉత్తమ ఫలితాలు



డిజిటల్ బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. దీని వల్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ విధానంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్టే.
– ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ

బాగా అర్థం అవుతున్నాయి



గతంలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఒక్కోసారి ఇంటికి వెళ్లాక మర్చిపోయే వాళ్లం. కానీ ఇప్పుడు చూసిన, విన్న పాఠాలు మళ్లీ మళ్లీ చూసుకునే వెసులుబాటు ఉంది. దీని వల్ల పాఠాలను బాగా అర్థం చేసుకుంటున్నాం. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితం సాధిస్తాను.
– పి.తనూశ్రీ, పదో తరగతి, నడుపూరు హైస్కూల్

సులభంగా.. వేగంగా..



డిజిటల్ విధానంలో పాఠాలు బోధిస్తుండడంతో చాలా బాగా అర్థమవుతున్నాయి. ఏదైనా క్లిష్టమైన టాపిక్ ఉంటే, వెంటనే అర్థం కాకపోతే ఇంటికెళ్లి మరోసారి దానిని చూసుకోవడంతో మళ్లీ మళ్లీ చదువుకొనే పరిస్థితి ఉండడం లేదు. ఈ విద్యా బోధన బాగుంది.
– బషీరున్నిసా, పదో తరగతి, ఇస్లాంపేట హైస్కూల్

ఎస్సీ,ఎస్టీ పారిశ్రామిక వేత్తల న్యూ ఇయర్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి, విశ్వా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) భవనంలో విశాఖ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (విశ్వా) నూతన సంవత్సరం 2024 డైరీని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్.గణపతి మాట్లాడుతూ పరిశ్రమలను స్థాపించుకునే ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ఎన్నో రకాలుగా అవకాశాలను కల్పిస్తోందన్నారు. త్వరలో ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అసోసియేషన్ ఫౌండర్ డాక్టర్ తెన్నేటి జయ రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల స్థాపనకు అవకాశం కలిపించడంతో 8 మంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలతో మొదలై.. నేటికి 160 మంది ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదిగారన్నారు. ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నత్తల ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐలా చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండు రంగ ప్రసాద్, ఎంఎస్ఎంఈ ఏడీ బి.ప్రభాకర్ కుమార్, స్టీల్‌ప్లాంట్ జీఎం భాను, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆడుపుగంటి అనార్ బాబు, ప్రతినిధులు అశోక్ రాజు, సీహెచ్.నూకరాజు, పి.వి.కె.వి.ఎస్.మూర్తి, వాసీవా కార్యదర్శి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



74వ వార్డులో డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న నాగిరెడ్డి, చిత్రంలో చందు, వంశీరెడ్డి

పెదగంట్యాడ: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలకు పునాది పడిందని, అవే పేదల ఇంటికి వెలుగులు తెచ్చాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 74వ వార్డు దయాల్‌నగర్–3 సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను శతశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) మాట్లాడుతూ ప్రజా సంక్షేమ కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా రావాలని ప్రజలంతా కోరుతున్నారన్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో 35కోట్ల 28 లక్షల 98వేల 220 రూపాయలు లబ్ధి చేకూర్చామని వివరించే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. సీకు రమణ, అనపర్తి త్రినాథ్, పూడి రమణ, ఒమ్మి ఈశ్వరి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: విపక్షకు తావు లేకుండా పార్టీలు, జెండాలు చూడకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా మింది సచివాలయ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సచివాలయ పరిధిలో నాన్ డీబీటీ, డీబీటీ ద్వారా లబ్ధిదారులకు రూ.18,17,08,661 అందజేశారని తెలిపారు. సంక్షేమ పథకాలు తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేసి, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. గాజువాక మండల కన్వీనర్ ఎస్ఎండీ గౌస్, నాయకులు రెడ్డిపల్లి చిట్టిబాబు, తిరుపతి ప్రసాద్, ఈటి సురేష్, గుడివాడ ప్రసాద్, వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, రొక్కం వెంకటరావు, అప్పారావు, నేలపాటి శ్యాంబాబు,రమణ, శాంతి కుమారి, శ్రీహరి పాల్గొన్నారు.

86వ వార్డులో ..

కూర్మన్నపాలెం: పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. 86వ వార్డు భరత్‌నగర్–2 సచివాలయ పరిధిలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో చందు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో భరత్ నగర్ సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి, వైఎస్సార్‌సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బుక్‌లెట్లు, కరపత్రాలు ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు బొడ్డ గోవింద్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్‌పట్నాయక్, సచివాలయ కన్వీనర్లు బాలకృష్ణ, మాటూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మిందిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న గుడివాడ లతీష్



86వ వార్డులో డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ఉరుకూటి చందు

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు

- కనులపండువగా స్వామి వారి కల్యాణం
- వైభవంగా పాలకావిడి ఉత్సవం



నాతయ్యపాలెంలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న దంపతులు



ఉక్కునగరంలో పాల కావిడి ఉత్సవాల్లో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

ఉక్కునగరం: సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలను స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం కనులపండువగా జరిపించారు. ఈ సందర్భంగా పాలకావిడి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాలధారులు పాలకావిడులతో ఉదయం 6 గంటలకు సెక్టార్–5 మరిడిమాంబ ఆలయం నుంచి బయల్దేరి, సెక్టార్–9లోని కాల భైరవి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామికి అష్టాభిషేకం, పాలకావిడి కలశ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సద్ది వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధుల పాల్గొన్నారు.

ఉక్కు శివాలయంలో కల్యాణం

ఉక్కు బీసీ గేటు శివాలయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అంతకు ముందు ఉమారామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కణితి పాత శివాలయంలో..

స్టీల్‌ప్లాంట్ రవీరేస్ బంక్ సమీప శివాలయంలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి పంచామృతాభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

69వ వార్డు నాతయ్యపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలోని కోదండ రామాలయం వద్ద గల సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శ్రీ వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. మూల విరాట్‌కు నారికేళ అభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, ఫలరస అభిషేకాలు నిర్వహించారు. స్వామిని నూతన వస్త్రాలు, సువర్ణ రజత హారాలతో అలంకరించారు. అనంతరం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అక్కిరెడ్డి బాలభాస్కరరావు, శ్రీనివాసరావు, ప్రకాష్, కుటుంబ సభ్యులు అక్కిరెడ్డి శ్రీను, కృష్ణ, పురుషోత్తం, సంద్రాన నర్సింగరావు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ



అతిథులను సత్కరిస్తున్న విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు

అగనంపూడి: అటల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ఏఐసీటీఈ, విజ్ఞాన్ ఐడియా ల్యాబ్ సంయుక్తంగా ఆరు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ముగిసింది. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ త్రీడీ ప్రింటింగ్ అండ్ డిజైనింగ్ థింకింగ్' అంశంపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఆరు రోజుల పాటు అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న ప్రొఫెసర్లు ఎస్.వి.స్వామినాయుడు, డేగల వెంకట కిరణ్, జి.శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపకులు బోధనా పద్ధతుల్లో మారుతున్న సాంకేతికతను జోడించి బోధన సాగించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, కో–ఆర్డినేటర్లు శ్రీనివాస్ నాయక్, భరత్‌కుమార్, అర్చనా ఆచార్య, ధనుంజయ పాల్గొన్నారు.

'ఉక్కు' సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే..



1040వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా ఫలించవని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉద్యమాలకు తల వంచక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1040వ రోజు వివిధ విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ, వాటిని అమలు జరిపే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకు వచ్చినా అడ్డుకుంటామన్నారు. పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా ఏర్పడిన సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'జిందాల్ స్టీల్‌తో చర్చలు బహిర్గతం చేయాలి'



ధర్నాలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు, హాజరైన నాయకులు

ఉక్కునగరం: జిందాల్ స్టీల్‌తో విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేస్తున్న రహస్య మంతనాలను బహిర్గతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు వచ్చిన జిందాల్ ప్రతినిధులతో జరిగిన ఒప్పందాలను బహిర్గతం చేయాలన్నారు. లేకుంటే ఉక్కు ఉన్నతాధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మూడు రోజులుగా సీఎండీ ఢిల్లీలో ఉండి జిందాల్‌కు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను కార్మిక సంఘాలన్నీ వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్ష టీడీపీ తదితర పార్టీలు స్పందించి, ప్లాంట్ రక్షణకు కార్యాచరణ ప్రకటించాలన్నారు. ధర్నాలో కార్పొరేటర్ బి.గంగారావు, కె.ఎస్.ఎన్.రావు, వై.మస్తానప్ప, కారు రమణ, సన్యాసిరావు, డి.వి.రమణ, కామేశ్వరరావు, సురేష్, వరసాల శ్రీనివాసరావు, శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'బాలోత్సవ్'లో బహుమతుల పంట

అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులకు అభినందనలు

అక్కిరెడ్డిపాలెం: ఇటీవల సెయింట్ ఆంథోనీ స్కూల్లో జరిగిన మెగా చిల్డ్రన్స్ ఫెస్టివల్ 'బాలోత్సవ్–2023'లో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 9వ తరగతి విద్యార్థి ఎం.జశ్వంత్ కుమార్ ఇంటర్‌నెట్ సెర్చింగ్, తెలుగు వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానం, తెలుగు మాట్లాడటంలో ద్వితీయ స్థానం సాధించాడు. డి.మహిమ వ్యాస రచన పోటీల్లో ప్రథమ, తెలుగు ప్రసంగంలో ద్వితీయ, తెలుగు మాట్లాడటంలో తృతీయ స్థానం సాధించింది. పి.గౌతమ్ తెలుగు వ్యాసరచన పోటీల్లో తృతీయ స్థానం, వై.ప్రీతి దినపత్రికా పఠనంలో ద్వితీయ స్థానం, టి.మనోజ్ మట్టిబొమ్మల తయారీలో కన్సొలేషన్ బహుమతి సాధించారు. 8వ తరగతి విద్యార్థిని దుర్గా చాందిని డ్రాయింగ్‌లో కన్సొలేషన్ ప్రైజ్, 7వ తరగతి విద్యార్థిని భారతి వ్యాసరచనలో ప్రథమం, మట్టిబొమ్మల తయారీలో కన్సొలేషన్ బహుమతులు సాధించింది. ఆర్.కావ్య మట్టిబొమ్మల తయారీలో తృతీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం మాట్లాడుతూ రోటరీ క్లబ్ సహకారంతో నిర్వహించిన బాలోత్సవ్‌లో సుమారు 100 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ నుంచి విద్యార్థులు పలు అంశాల్లో పాల్గొన్నారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు సుమారు 16 బహుమతులు దక్కించుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.వేణు, రవిచంద్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో హెచ్ఎం కాంతం, ఉపాధ్యాయులు

భెల్ అధికారి దృష్టికి కార్మికుల సమస్యలు



భెల్ హెచ్ఆర్ ఏజీఎం సంతోష్ కుమార్ గుప్తాతో యూనియన్ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్ఈఎల్ ఢిల్లీ కార్పొరేట్ కార్యాలయం నుంచి వచ్చిన ఏజీఎం (హెచ్ఆర్) సంతోష్‌కుమార్ గుప్తాను సంస్థకు చెందిన బీహెచ్‌పీవీ స్టాఫ్ అండ్ వర్కర్స్ (ఏఐటీయూసీ) యూనియన్ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థలోని కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో భెల్ హెచ్ఆర్ హెడ్ ఎం.వి.ఎస్.ఎన్.రాజు, మేనేజర్ జి.చంద్రశేఖర్, పి.వి.ఎస్.రాజు, కొల్లి దేముడు, బొండా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.